# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-01-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**

2. **తెలంగాణలోని సూర్యాపేట, ములుగు జిల్లాలలో రెండు సాగునీటి పథకాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

3. **రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

4. **ప్రముఖ ప్రజా కవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంతి ఈ రోజు.**

==========================

స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారుల బృందం దావోస్ బయలుదేరి వెళ్లింది. భారత కాలమానం ప్రకారం ఈ ఉదయం 11 గంటలకు జ్యూరిచ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ తో ముఖ్యమంత్రి మర్యాద పూర్వకంగా సమావేశమవుతారు. అనంతరం వివిధ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతోసమావేశమై పెట్టుబడులపై చర్చిస్తారు. భారత రాయబార కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి హాజరవుతారు. ఈరోజు నుంచి 22వ తేదీ వరకూ దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమవుతారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

------------------------

తెలంగాణలోని సూర్యాపేట, ములుగు జిల్లాలలో రెండు సాగునీటి పథకాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిన్న సాయంత్రం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రి వర్గం చర్చించి ఆమోదం తెలిపింది. సమావేశ నిర్ణయాలను సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాత్రికేయులకు వెల్లడిస్తూ..

వాయిస్ .. 30 సెకన్లు

మంత్రివర్గ సమావేశం అనంతరం మేడారంలోనే బస చేసిన ముఖ్యమంత్రి మంత్రులతో కలిసి ఈ ఉదయం నూతనంగా నిర్మించిన సమ్మక్క--సారలమ్మ గద్దెలను ప్రారంభించనున్నారు. వనదేవతలకు సారె, బెల్లంతో మొక్కులు సమర్పించి హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణమవుతారని అధికారులు తెలిపారు.

--------------------------

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్లబండ్ల పోటీలను నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పర్యవేక్షణకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ –ఆర్టీజీఎస్ సేవలను వినియోగించుకోనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వ్యాధులు ప్రబలకుండా సాంకేతికతను వినియోగించుకునేందుకు ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇందుకోసం ఆర్టీజీఎస్‌లోని అడ్వాన్స్ వార్నింగ్ అడ్వైజరీ ఫర్ రిసిలియెంట్ ఎకోసిస్టమ్– అవేర్ ద్వారా రాష్ట్రంలో వ్యాధుల తీవ్రత, వ్యాప్తికి ఉన్న అవకాశాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వాటి నివారణ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో నమోదైన కేసుల వివరాలను కూడా అనుసంధానం చేస్తామని, తద్వారా ప్రాంతాల్లోని పరిస్థితులపై పూర్తి అవగాహన వస్తుందని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఈ రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు రాష్ట్రంలోని 13,257 గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువుల ఆరోగ్య రక్షణ, ఉత్పాదకత పెంపుదల, వ్యాధుల నియంత్రణ పశుపోషణ ఖర్చులను తగ్గించడం, పశు పోషణ పై అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

--------------------------

సంక్రాంతి సెలవులు ముగియడంతో సొంతూళ్ల నుంచి హైదరాబాద్ కు వెళ్ళే వారితో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రద్దీ కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్ గేట్ వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. వాహనాల రద్దీని ట్రాఫిక్ DCP షరీన్ బేగం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ కృష్ణ మాట్లాడుతూ,

వాయిస్ .. 25 సెకన్లు

--------------------------

ప్రముఖ ప్రజా కవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంతి ఈ రోజు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనంతపురం జిల్లా కదిరి మండలం కటారుపల్లిలో వేమన సమాధి వద్ద.. ఆయన జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది. వేదాంతాన్ని అతి సామాన్య మానవునికి సైతం అందుబాటులో ఉండేట్టు స్వచ్ఛమైన, అచ్చమైన తేట తెలుగు పద్యాలలో వివరించిన మహానుభావుడు.... యోగి వేమన. వేమన పద్యం గురించి తెలియని తెలుగు ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. బ్రిటిష్ అధికారి సి.పి. బ్రౌన్ చొరవతో వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయి.

---------------------------

ఒడిశాలోని నైనీ ప్రాంతంలో సింగరేణి సంస్థకు చెందిన బొగ్గు గని తవ్వకాలకు సంబంధించిన టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, టెండర్ల దాఖలుకు విధించిన అర్హత నిబంధనలపై ఆరోపణలు రావడంతో రద్దు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. టెండర్ల దాఖలుకు అర్హత నిబంధనలను సింగరేణి పాలకమండలి ఖరారు చేస్తుందని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో కానూరు – ఉసులుమర్రు ప్రధాన రహదారి పనులను మంత్రి నిన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రానున్న పుష్కరాలు నాటికి నియోజకవర్గంలో రహదారులను ఆధునీకరించి అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం కొనసాగుతుండడంతో పాటు దట్టమైన పొగమంచు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

ఇక తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 3.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

=====================